SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 185 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | గురువారం 24-09-2026

## బీజేపీలో కీలక మార్పులు..
## ఏపీ, తెలంగాణకు కొత్త ఇన్‌చార్జిలు



❖బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చేసింది.

❖ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను నియమించింది. ఏపీ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియాను, కో-ఇన్‌చార్జిగా శ్రీమతి వనతి శ్రీనివాసన్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది.

బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను నియమించింది. ఏపీ బీజేపీ ఇన్‌చార్జిగా మిగతా 2లో

## మైహోమ్ సహా పలు పారిశ్రామిక
# సంస్థలకు ప్రోత్సాహకాలు

- 2027లోగా హంద్రీనీవా పనులు పూర్తవ్వాలి
- రాయలసీమకు లక్ష కోట్ల వరం.. అక్టోబర్ 2న హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఆరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలు
- నిర్మలా సీతారామన్‌తో కలిసి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- రిలయన్స్ ఏర్పాటు చేయనున్న అగ్రికల్చర్ స్కూల్‌కు కూడా అంకురార్పణ
- వరుస కార్యక్రమాలతో ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు బిజీ బిజీ



ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, భారీ పెట్టుబడుల ఆకర్షణ, స్థానిక యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి నిర్మాణంలో భూములిచ్చిన ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనలను సవరించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల స్థాపనకు ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకుంది. మిగతా 2లో

## ‘కష్టంలో ఉన్న ప్రతీ ఒక్కరి వద్ద
## జగన్ మనిషి ఉండాలి’





- స్థానిక సంస్థల ఎన్నికలకు అంతా సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని నాని విజ్ఞప్తి చేశారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నుంచి ఎవరిని నిలబెట్టినా వారికి అండగా నిలవాలన్నారు.

కృష్ణా జిల్లా: స్థానిక సంస్థల ఎన్నికలకు అంతా సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని నాని విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో

# ఇరాన్‌ను నాశనం చేసేయాలా?’

- ఐరాస వేదికగా ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- ఒప్పందం లేకుంటే నాశనం చేస్తామంటూ వ్యాఖ్య
- ఎన్నికల తర్వాత డీల్ కుదురుతుందని అంచనా
- ఇరాన్‌ను ఆర్థికంగా ఒంటరి చేయాలని పిలుపు
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా కీలక వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేసే అవకాశం మిగతా 2లో

# ‘సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం’

- ‘సర్’ వివాదం నేపథ్యంలో ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- ‘ఓటు చోరీ’ రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్య
- ఇద్దరు ఈసీల అభ్యంతరాలపై మీడియాలో కథనం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు
- 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మిగతా 2లో

## మొదటి విడతగా 24 వేల మంది
# పేదలకు పట్టాల పంపిణి



⌘ఎవరైతే పేదవారు ఉన్నారో వారికి ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమం ద్వారా పట్టాలు మంజూరు చేస్తున్నామని విజయవాడ ఎంపీ, టీడీపీ నేత కేశినేని చిన్ని తెలిపారు.

⌘24,042 మంది పేదవారిని గుర్తించామన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన సీఎం చంద్రబాబు నేతృత్వంలోఈ పట్టాలను పేదలకు అందిస్తామని పేర్కొన్నారు.

⌘విజయవాడ వాసులకు దసరా, దీపావళి పండగ ముందే వస్తుందని అన్నారు.

ఎవరైతే పేదవారు ఉన్నారో వారికి ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమం ద్వారా పట్టాలు మంజూరు చేస్తున్నామని విజయ వాడ ఎంపీ, టీడీపీ నేత కేశినేని చిన్ని తెలిపారు. 24,042 మంది పేదవారిని గుర్తించామన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఈ పట్టాలను పేదలకు మిగతా 2లో

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
# రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- ★కృష్ణా జలాల విడుదలపై కర్ణాటక సీఎంకు థ్యాంక్స్ చెప్పిన సీఎం రేవంత్
- ★ది పారడైజ్’ ప్రీమియర్ వేళ హీరో నాని విజ్ఞప్తిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన
- ★సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- ★అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ★ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- ★చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- ★పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం
- ★రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది.
- ★చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది.
- ★ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు.



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు మిగతా 2లో

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే
## పసికందుల మరణాలు



❄ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డులో చోటుచేసుకున్న షార్ట్‌సర్క్యూట్ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

❄ఈ ఘటనలో ఇప్పటికే ముగ్గురు శిశువులు మృతి చెందగా.. తాజాగా మరో ఇద్దరు శిశువులు మృతి చెందినట్లు తెలుస్తోంది.

ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డులో చోటుచేసుకున్న షార్ట్‌సర్క్యూట్ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఇప్పటికే ముగ్గురు శిశువులు మృతి చెందగా.. తాజాగా మరో ఇద్దరు శిశువులు మృతి చెందినట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరినట్లు సమాచారం. మృతుల్లో దుబ్బగూడ, లింగాపూర్‌కు చెందిన శిశువులు ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం అనంతరం పొగ పీల్చిన పలువురు శిశువులను మిగతా 2లో

## రూ.5వేల కోట్ల విలువైన భూములను
# గీతం పేరుతో కబ్జా చేస్తున్నారు.

**చంద్రబాబు వచ్చాకే తాగునీటి సమస్య: వైఎస్ జగన్**

- డిజిటల్ డైరీలో నమోదు నమోదు చేయండి
- గ్రేటర్ విశాఖపట్నం నేతలతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సమావేశమయ్యారు.
- దీనిలో పార్టీ సీనియర్ నేతలు బొత్స, కేకే రాజు, గుడివాడ అమర్నాథ్, సహా పలువురు నేతలు పాల్గొన్నారు.
- పార్టీ అభివృద్ధి, స్థానిక సమస్యలు సహా పలు అంశాలపై చర్చించారు.



తాడేపల్లి : గ్రేటర్ విశాఖపట్నం నేతలతో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సమావేశమయ్యారు. దీనిలో పార్టీ సీనియర్ నేతలు బొత్స, కేకే రాజు, గుడివాడ అమర్నాథ్, సహా పలువురు నేతలు పాల్గొన్నారు. మిగతా 2లో

## దేశంలో 1980 ఫోటో ట్రెండ్..
## రాష్ట్రంలో 1980ల నాటి పరిస్థితులు



రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది: జూరాల నీటి విడుదలపై కేటీఆర్

జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం

పోరాడితో పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్

రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. మిగతా 2లో

## అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు..
# కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

**ఉపాధ్యాయులపై దాడి చేసిన వారు పరారయ్యారు**

- స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్న లోకేశ్
- ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని వ్యాఖ్య
- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు.




ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగతా 2లో

## ఇరాన్‌ను నాశనం చేసేయాలా?'

ఉందంటూ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో మంగళవారం ప్రసంగించిన ట్రంప్.. ఇరాన్‌కు రెండు మార్గాలే ఉన్నాయని అన్నారు. అమెరికాతో ఒప్పందం చేసుకుని దేశాన్ని తిరిగి నిర్మించుకోవడం లేదా మరిన్న సైనిక చర్యలను ఎదుర్కోవడమని పేర్కొన్నారు."నేను ఇస్లామిక్ రిపబ్లిక్‌ను త్వరగా నాశనం చేయాలా? వారికి మళ్లీ ప్రాణాలతో బయటపడే అవకాశం లేకుండా చేయాలా?" అని ట్రంప్ ప్రశ్నించారు. అయితే అమెరికా మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ కూడా అమెరికా ఎన్నికల ఫలితాల కోసం వేచి చూస్తోందని చెప్పారు.ఇరాన్‌కు అణ్వాయుధం దక్కకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ వాణిజ్య నౌకలపై దాడులు ఆపే వరకు, అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టే వరకు, ఉగ్రవాదానికి మద్దతు నిలిపే వరకు ఆ దేశాన్ని పూర్తిగా ఆర్థికంగా ఒంటరిగా చేయాలని ఇతర దేశాలను కోరారు.ఇరాన్‌తో జరిగిన ఘర్షణల్లో తమ సైనిక చర్యలు ఆ దేశ నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు, క్షిపణులు, డ్రోన్ల తయారీ సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే అమెరికా వద్ద ఆయుధాల కొరత లేదని చెప్పారు. కొత్తగా 18 ఆయుధాల తయారీ కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.గాజా యుద్ధంపైనా ట్రంప్ మాట్లాడారు. యుద్ధాన్ని ముగించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, బందీల విడుదలకు కృషి చేసిందని చెప్పారు. తన 20 పాయింట్ల గాజా శాంతి ప్రణాళికకు ఐరాస భద్రతా మండలి మద్దతు తెలిపిందని పేర్కొన్నారు.ఉక్రెయిన్-రష్యా యుద్ధంపైనా ట్రంప్ స్పందించారు. ఇరు దేశాల నేతలతో అమెరికా సన్నిహితంగా చర్చలు జరుపుతోందని.. ఈ యుద్ధాన్ని ముగించేందుకు ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా విమర్శలు చేసిన ట్రంప్.. కృత్రిమ మేధ నియంత్రణకు సంబంధించిన అంతర్జాతీయ ప్రయత్నాలను కూడా వ్యతిరేకించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సాక్షిగా ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తమతో ఒప్పందానికి ఇకనైనా ముందుకు రాకపోతే ఇరాన్‌ను నాశనం చేస్తామని, నరకానికి పంపిస్తామని తేల్చిచెప్పారు. ట్రంప్ మంగళవారం ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశంలో 37 నిమిషాలపాటు ప్రసంగించారు. ఇరాన్‌పై మరిన్ని సైనిక చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. ఇరాన్‌తో ఏడు నెలలుగా సాగుతున్న యుద్ధాన్ని సమర్థించారు. ఇరాన్ అణ్వాయుధాలు సొంతం చేసుకోకుండా ఈ యుద్ధం నిరోధించిందని, పశ్చిమాసియాలో ఆధిపత్య శక్తిగా ఇరాన్ స్థానాన్ని అంతం చేసిందని పేర్కొన్నారు.

## 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం'

ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు.ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం. సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది.అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి.

### మొదటి విడతగా 24 వేల మంది పేదలకు పట్టాల పంపిణి

అందిస్తామని పేర్కొన్నారు. విజయవాడ వాసులకు దసరా, దీపావళి పండగ ముందే వస్తుందని అన్నారు. బుధవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. లక్ష కోట్ల రూపాయల స్థలాన్ని పేదలకు పట్టాల రూపంలో అందిస్తున్నామని చెప్పారు.మొదటి విడతగా 24 వేల మందికి పట్టాలు ఇవ్వడం శుభపరిణామమని అన్నారు. పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులు అందరిని పిలుస్తామని తెలిపారు. ఇంకా కొందరు లబ్ధిదారులు ఉన్నారని.. వారికి సెకండ్ ఫేజ్‌లో పట్టాలు అందిస్తామని ప్రకటించారు. 24 వేల కుటుంబాలకు లక్ష కోట్ల రూపాయిల అస్తికి పట్టాల పంపిణి చేస్తున్నట్లు వివరించారు.పేదలకు పట్టాభిషేకం అనేది మంచి కార్యక్రమమని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభివర్ణించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులుగా తాము కంటున్న కల ఇదని తెలిపారు. దీనిపై జిల్లా సమావేశాల్లో చర్చించామని చెప్పారు. అధికారులంతా కృషి చేసి పట్టాలు ఇవ్వడంలో సహకరించారని పేర్కొన్నారు. జాటిలమైన సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.అర్హులైన పేదలందరికి పట్టాలను అందజేస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణి జరుగుతుందన్నారు. ఈ పట్టాల విషయంలో సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని వివరించారు. అర్హులైన ఏ ఒక్కరినీ వదలకుండా పరిశీలన చేసిన పట్టాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేబినెట్‌లో పెట్టి ఆమోదింప చేసుకొని పట్టాలు ఇస్తున్నారని జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పసికందుల మరణాలు

అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు తరలించారు. తాజాగా ఒక శిశువు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా..మరో శిశువును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఎస్ఎన్‌సీయూ వార్డులో షార్ట్‌సర్క్యూట్‌కు దారితీసిన పరిస్థితులు, అగ్నిప్రమాద సమయంలో భద్రతా ఏర్పాట్లు, అత్యవసర తరలింపు చర్యలపై అధికారులు పరిశీలన చేపడుతున్నారు.ఆదిలాబాద్ రిమ్స్‌లో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు.ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డును పరిశీలించిన ఆమె.. ఐదుగురు పసికందుల మృతి అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని ఆరోపించారు.రిమ్స్‌లో గతేడాది 204 మంది, అంతకుముందు ఏడాది 174 మంది చిన్నారులు మృతి చెందినట్లు కవిత తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన స్థాయిలో వైద్యులు, నర్సులు, శానిటేషన్ సిబ్బంది లేరని, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని ఆరోపించారు. 150 ఏసీలు ఉన్నప్పటికీ మెకానిక్ లేకపోవడం, కేవలం ముగ్గురు ఎలక్ట్రీషియన్లు ఉండటం పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. ఆరోగ్యశ్రీ కింద సుమారు రూ.500 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు.ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానని చెప్పిన ముఖ్యమంత్రి.. ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటన పై స్వయంగా వచ్చి పరిస్థితులను పరిశీలించాలని కవిత డిమాండ్ చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి రిమ్స్‌కు వచ్చి వెళ్లడం తప్ప సమగ్ర సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.రిమ్స్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో శిశువులు, గర్భిణుల మరణాలు, వైద్య ఆరోగ్య సేవలపై తమ పార్టీ తరపున ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర అధ్యయనం చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రికి నెల రోజుల సమయం ఇస్తున్నామని, ఈలోగా రిమ్స్ పెండింగ్ బిల్లులు చెల్లించడం తో పాటు ఆదివాసీ ప్రాంతాలకు రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు.

### బీజేపీలో కీలక మార్పులు.. ఏపీ, తెలంగాణకు కొత్త ఇన్‌చార్జిలు

డాక్టర్ అరవింద్ భదౌరియాను, కో-ఇన్‌చార్జిగా శ్రీమతి వనతి శ్రీనివాసన్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్‌ను, కో-ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, శ్రీమతి రేఖా శర్మలను నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం.. రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు.. రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు వచ్చాయి.ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను పార్టీ అప్పగించింది. బీజేపీ ఏపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని బీజేపీ ఒడిశా ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణను తమిళనాడు బీజేపీ కో-ఇన్‌చార్జిగా, డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో-ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో తెలుగు రాష్ట్రాల నాయకులకు ఇతర రాష్ట్రాల్లో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు కూడా దక్కాయి. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇక కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

## 'కష్టంలో ఉన్న ప్రతీ ఒక్కరి వద్ద జగన్ మనిషి ఉండాలి'

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నుంచి ఎవరిని నిలబెట్టినా వారికి అండగా నిలవాలన్నారు. మనుషులను డబ్బుతో కొనలేరని, కష్టంలో ఉన్న ప్రతీ ఒక్కరి వద్ద జగన్ మనిషి ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతకై నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో పేర్ని నాని మాట్లాడారు.'వంశీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పోలవరం కాలువ నుంచి రైతులకు నీరిచ్చేవాడు. రైతుల మోటార్ల మీద చెయ్యి వేసే దమ్ము కూడా ఎవరికీ ఉండేవి కాదు.మోటార్లు పీకేస్తున్నా మీ ఎమ్మెల్యే ఏం చేయలేకపోయాడు. వంశీ చంద్రబాబుకు లెటర్ రాసి మోటార్లు పీకేయకుండా అడ్డుకున్నాడు. చంద్రబాబు మాట్లాడితే కరెంట్ బిల్లులు తగ్గిస్తానంటాడు. కానీ బిల్లు పట్టుకుంటేనే షాక్ కొడుతుంది. సాగుకు నీరు ఇవ్వలేరు కానీ సారాయి మాత్రం ఏరులై పారిస్తున్నారుపోలవరం కాలువ కింద నీరు ఇవ్వలేరు కానీ కాల్వ గట్లను మాత్రం తవ్వేస్తున్నారు. వందల లారీలు తరలి పోతున్నాయి. ఈ మట్టిలో మంత్రి కొల్లు రవీంద్రకు వాటా ఎంత?, ఇంకా మీకు మిగిలింది రెండేళ్లే. నున్న పోలవరం కాలువ గట్టు మీద మట్టి దోచుకున్నోళ్ల మీద కేసులుండవా?, రోజులు లెక్కబెట్టండి. మీరు తిన్న ప్రతీ రూపాయి జనం కక్కిస్తారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు జీతం తీసుకోవడానికే పనికొస్తాడు. రైతులకు ఎరువులు ఇచ్చే నాథుడు లేదు. రైతులను ఎరువుల ధరలు పెంచేసి దోచుకుంటున్నారు. చంద్రబాబు రెండేళ్లలో ఒక్క కౌలు రైతుకు డబ్బులు ఇచ్చాడా?, వైఎస్ జగన్ సెంటున్నర భూమి ఇస్తే చంద్రబాబు, లోకేష్ హేళనగా మాట్లాడారు. 30 లక్షల మంది సొంతింటి కలను జగన్ నెరవేర్చారు. 3 సెంట్లు ఇస్తానని చెప్పి మూడేళ్లైంది ఒక్కరికైనా ఇచ్చారా చంద్రబాబు. ఆరోగ్య్రశ్రీ కి ఈ ప్రభుత్వం డబ్బులివ్వడం లేదు.

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.కృష్ణా జలాలను తెలంగాణ రాష్ట్రానికి విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అందుకు కర్ణాటక సీఎం శివకుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ప్రతిస్పందించారు. తెలంగాణ ప్రజల తరఫున కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.కృష్ణా జలాలను తెలంగాణకు విడుదల చేయాలన్న తన విజ్ఞప్తిని అంగీకరించినందుకు ఆయనకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య స్నేహభావానికి ఇదొక గొప్ప ఉదాహరణ అని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ ప్రజల మధ్య ఉన్న సోదర భావానికి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. దేశ ప్రజల మధ్య ప్రేమ, సోదరభావాన్ని చాటేలా కృష్ణా జలాల విడుదల నిర్ణయం తీసుకున్నారంటూ కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం రేవంత్ స్పందించారు. టాలీవుడ్ యంగ్ హీరో, నేచురల్ స్టార్ నాని నటించిన తాజా చిత్రం 'ది పారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 23 రాత్రి హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి ప్రీమియర్ షోను వీక్షించేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని నాని సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా చూడటం తనకు ఎంతో ప్రత్యేకమైన భావోద్వేగమని, ప్రేక్షకుల కోసం సినిమాలు చేస్తామని, వారి మధ్య కూర్చొని ప్రత్యక్షంగా స్పందనను ఆస్వాదించడంలోనే ఒక నటుడిగా తనకు నిజమైన సంతృప్తి దక్కుతుందని 'ఎక్స్' (ట్విట్టర్)లో పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తెలంగాణ పోలీసు యంత్రాంగాన్ని ట్యాగ్ చేస్తూ అనుమతి కోసం విజ్ఞప్తి చేశారు.నాని పోస్టుపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూనే భద్రతాపరమైన మార్గదర్శకాలను స్పష్టం చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వంటి రద్దీ ప్రదేశంలో ప్రీమియర్ షోకు హాజరయ్యేందుకు అధికారిక నిబంధనలను పాటించాలని సూచించారు. భారీగా తరలివచ్చే అభిమానుల నియంత్రణ, శాంతిభద్రతలు, సాధారణ ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని హీరో నాని కి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన తర్వాత భద్రతా ఏర్పాట్లను అంచనా వేసి సంబంధిత పోలీసు బృందం తదుపరి నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేస్తూ, ఈ ప్రక్రియ కోసం తెలంగాణ డీజీపీని సీఎం ట్యాగ్ చేశారు.రాష్ట్రంలోని దళితులు, గిరిజనులు, ఆదివాసీల సమగ్ర అభివృద్ధి, ఆత్మగౌరవం, పౌరహక్కుల పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రజా ప్రభుత్వం నిరంతరం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేవలం పథకాల కేటాయింపులతోనే సరిపెట్టకుండా నాణ్యమైన విద్య, స్థిరమైన ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సామాజిక సమానత్వం సిద్ధించి సమాజంలో గుణాత్మక మార్పు వస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై అణచివేతను, వివక్షను పూర్తిగా రూపుమాపేందుకు రాజకీయ విభేదాలను పక్కనబెట్టి అందరూ ఒకే వేదికపైకి వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా వెంటనే విడుదల చేసేందుకు 'గ్రీన్ చానెల్' ద్వారా నిధులు కేటాయించాలని, సకాలంలో ఆర్థిక సహాయం, పునరావాసం దక్కేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం-1989 అమలు తీరుతెన్నులపై ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ కీలకమైన సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతోపాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన చివరిసారిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగిందని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించకపోవడం శోచనీయమని అన్నారు.

## మైహోమ్ సహా పలు పారిశ్రామిక సంస్థలకు ప్రోత్సాహకాలు

ముఖ్యంగా శ్రీసిటీలో క్యాటర్‌పిల్లర్ గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీ, సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో పలు పరిశ్రమలకు భూ కేటాయింపులకు పచ్చజెండా ఊపిన కేబినెట్.. పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఏర్పాటవుతున్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రతిష్ఠాత్మక గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ యూనిట్‌కు భారీ ప్రోత్సాహకాలను ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది.దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ పారిశ్రామిక దిగ్గజమైన మై హోమ్ గ్రూప్ పల్నాడు రీజియన్‌లో ఏర్పాటు చేయనున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ రాష్ట్ర మౌలిక రంగానికి కీలక ఊతంగా నిలవనుంది. సున్నపురాయి నిల్వలు పుష్కలంగా ఉన్న దాచేపల్లి ప్రాంతంలో అత్యాధునిక హరిత సాంకేతిక పరిజ్ఞానంతో, పర్యావరణహిత ప్రమాణాలకు అనుగుణంగా ఈ గ్రీన్ సిమెంట్ తయారీ యూనిట్‌ను మై హోమ్ సంస్థ నిర్మించనుంది. ప్రభుత్వం అందించే ప్రత్యేక రాయితీలు, మౌలిక సదుపాయాల సహకారంతో రాబోయే ఈ భారీ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో రూ. వేల కోట్ల పెట్టుబడులు కేంద్రీకృతం కావడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ సరికొత్త పుంతలు తొక్కనుంది.ఈ పరిశ్రమ స్థాపన ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, ప్లాంట్ ఆపరేషన్స్ విభాగాల్లో నైపుణ్యం కలిగిన నిరుద్యోగులకు నేరుగా ఉద్యోగాలు దక్కడంతో పాటు రవాణా, లాజిస్టిక్స్, మైనింగ్, అనుబంధ చిన్న తరహా పరిశ్రమల రంగాల్లో వేలాది కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుంది. పల్నాడు ప్రాంతం నుంచి సిమెంట్ ఉత్పత్తులను రాజధాని అమరావతి నిర్మాణ అవసరాలకు, రాష్ట్రంలోని ఇతర భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వేగంగా రవాణా చేసేలా పక్కా ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.రాష్ట్ర విభజన తర్వాత మందగించిన పారిశ్రామిక వేగాన్ని తిరిగి పరుగులు పెట్టించాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ఇలాంటి భారీ సంస్థలకు ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. ఒకవైపు అమరావతి అభివృద్ధికి కట్టుబడుతూ రైతులకు భరోసా ఇవ్వడం, మరోవైపు రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో మై హోమ్, క్యాటర్‌పిల్లర్ వంటి బడా సంస్థలకు రెడ్ కార్పెట్ పరచడం ద్వారా కూటమి ప్రభుత్వం స్పష్టమైన పారిశ్రామిక ఎజెండాతో ముందుకు సాగుతోందన్న సంకేతాలు పంపింది.హంద్రీనీవా సుజల స్రవంతి పనులపై సీఎం చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. 2027లోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు(బుధవారం) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హంద్రీనీవా సుజల స్రవంతి, శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని సీఎం అడిగారు. హంద్రీనీవా సుజల స్రవంతిఫేజ్-II పనుల పురోగతి, శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ, పనుల పూర్తిపై ఆరా తీశారు.ఎచీూా ఫేజ్--IIలో మిగిలిన పనులకు రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ పనులను 2027 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లికి స్పష్టం చేశారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని ఎచీూా మెయిన్ కెనాల్‌కు సంబంధించి 490 - 535 కిలో మీటర్ల వరకు సుమారు రూ.350 కోట్ల విలువైన పనులు కూడా సమగ్రంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.పనులు పూర్తయితే ఎచీూా ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలు తీరడంతో పాటు సుమారు 25 వేల ఎకరాల ఖాళీ చెరువులను నింపి ప్రజలకు నీటి భరోసా కల్పించేందుకు అవకాశం ఉంటుందని మంత్రి మండిపల్లి తెలిపారు. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను ఎచీూా కెనాల్‌తో అనుసంధానం చేసి, మార్గమధ్యంలోని చెరువులను నింపేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎచీూా పనులకు ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

స్థానిక ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు బాగా పడుతున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. పంటలు వేసేందుకు రైతులను ప్రోత్సహించాలని.. వారికి అవసరమైన విత్తనాలు ఇవ్వాలని ఆదేశించారు. మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను అక్టోబర్ రెండవ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు ఈ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకుని రావాలని.. మూడు పార్టీల మధ్య ఐక్యత ఉండాలని సూచించారు. తొలిదశలో మున్సిపాలిటీలు, రెండో దశలో జెడ్పీటీసీ ఎన్నికలు, మూడో దశలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడులు, శాప్ కార్యాలయంపై దాడులు చేసింది ఒకరే అని.. ఎక్కడికి వెళ్లినా 100 మంది రౌడీషీటర్లను వెంటేసుకుని వెళ్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ బెంగళూరులో కూర్చొని రౌడీ షీటర్లను, క్రిమినల్స్‌ను పంపి నేరాలు చేయిస్తున్నారని విమర్శించారు. రాజకీయ పార్టీల ముసుగులో శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే పరిహారం వసూలు చేసే విధంగా చట్టం తీసుకురావాలని డీజీపీకి సీఎం చంద్రబాబు సూచించారు.దశాబ్దాలుగా కరవుతో అల్లాడుతున్న రాయలసీమ రూపురేఖలను మార్చే బృహత్తర ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సుమారు లక్ష కోట్ల రూపాయల భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరగనుంది.

## రూ.5వేల కోట్ల విలువైన భూములను గీతం పేరుతో కబ్జా చేస్తున్నారు.

పార్టీ అభివృద్ధి, స్థానిక సమస్యలు సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా తాగడానికి నీళ్లు లేని పరిస్థితి వచ్చిందని, ఇంతవరకు ఎప్పుడూ లేని విధంగా విశాఖలో మూడు రోజులకు ఒకసారి తాగునీరు ఇచ్చే పరిస్థితి వచ్చిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాతే విశాఖలో ఈ పరిస్థితి కనిపిస్తోందన్నారు. పోలవరం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉంటే విశాఖతో పాటు ఉత్తరాంధ్రకు గ్రావిటీ ద్వారా నీళ్లు ఇవ్వగలమన్నారు. ఒకవైపు పోలవరంలో ఎత్తు తగ్గించి, 75 టీఎంసీల వరకు అదనపు నిల్వ సామర్థ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. మరోవైపు విశాఖలో మూడు రోజులకు ఒకసారి నీళ్లు ఇచ్చే పరిస్థితి తీసుకొచ్చారని జగన్ పేర్కొన్నారు. విశాఖ భూముల విషయమై మాట్లాడుతూ రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, విశాఖపట్నంలో మాత్రం 99 పైసలకు చంద్రబాబు తనకు కావాల్సిన వాళ్లకు భూములు ఇస్తున్నారు. రూ.5వేల కోట్ల విలువైన భూములను గీతం పేరుతో కబ్జా చేస్తున్నారు. విశాఖలో అత్యంత విలువైన భూములను తమకు నచ్చినవారికి ఇచ్చేసే స్థాయికి ఈ ప్రభుత్వం వెళ్లిపోయిందన్నారు. తమ హయాంలో విశాఖ అభివృద్ధి గురించి జగన్ మాట్లాడుతూ మా ప్రభుత్వ హయాంలో విశాఖపట్నంలో లక్షా 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేశాం. కేజీహెచ్‌ను అభివృద్ధి చేశాం. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేశాం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మూలపేట పోర్టు వరకు ఉత్తరాంధ్ర అభివృద్ధికి పునాదులు వేశాం. గూగుల్, అదానీ డేటా సెంటర్ వరకు ఉత్తరాంధ్రలో పెట్టుబడులు వచ్చేలా ముందుకు తీసుకెళ్లాం. ఉత్తరాంధ్రలో ఎక్కడ చూసినా మా ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి కనిపించిందన్నారు. ఉద్దానం కిడ్నీ సమస్య పరిష్కారానికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను తీసుకొచ్చాం. ఉద్దానం కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా హిరమండలం నుంచి సర్ఫేస్ వాటర్‌ను తీసుకొచ్చామన్నారు. రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసి ఉద్దానం వరకు నీళ్లు తీసుకొచ్చామని, ట్రైబల్ యూనివర్సిటీ, ట్రైబల్ ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీలను తీసుకొచ్చామని పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మెడికల్ కాలేజీలు, నాడు--నేడు పనులతో ఉత్తరాంధ్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లామని అన్నారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో గంజాయితో పాటు మద్యం అందుబాటులోకి వచ్చిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి వీధి చివర, గుడి పక్కన, బడి పక్కన కూడా గంజాయి, మద్యం అందుబాటులోకి వచ్చాయి. మా హయాంలో గ్రామస్థాయిలో మహిళా పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఇలాంటి వ్యవహారాలు కనిపిస్తే వెంటనే రిపోర్టింగ్ జరిగే వ్యవస్థను ఏర్పాటు చేశాం. గంజాయి, మద్యం వంటి వాటిని అరికట్టే పరిస్థితి నుంచి ఇప్పుడు వాటిని ప్రోత్సహించే స్థాయికి తీసుకెళ్లారన్నారు. మా హయాంలో ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో మహిళా పోలీస్‌ను అందుబాటులో ఉంచాం. దిశ యాప్‌ను తీసుకొచ్చాం. మహిళకు సమస్య వస్తే ఫోన్ చేసినా, ఫోన్ షేక్ చేసినా వెంటనే పోలీసులు అందుబాటులోకి వచ్చే వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఆ వ్యవస్థ మొత్తం రివర్స్ గేర్‌లోకి వెళ్లిపోయిందని జగన్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని జగన్ పేర్కొన్నారు. ప్రశ్నించిన వారిని అరెస్టులు చేస్తున్నారు. తప్పుడు సాక్ష్యాలతో వేధిస్తున్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాన్ని నడుపుతున్నారు. మా హయాంలో మేము ఏ రోజు పోలీసుల మీద ఆధారపడి రాజకీయాలు చేయలేదు. ఎన్నికలు గెలవడానికి పోలీసులను ఉపయోగించలేదు.

## అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు.. కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ, అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులపై గూండాలతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.తమ దగ్గర రెడ్ బుక్ ఉందని, ఎవర్నీ వదిలిపెట్టమని మంత్రి నారా లోకేశ్ వార్నింగ్ ఇచ్చారు. అనంతపురం జిల్లా రాప్తాడులో పర్యటించిన ఆయన వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకపోయినా డీఎస్సీలో అవకతవకలు జరిగాయంటూ వైసీపీ నేతలు నిరసన చేపట్టడంపై లోకేశ్ స్పందించారు. టీచర్లపై దాడులు, బూతులే వైసీపీ నేతల సంస్కారమా అని ప్రశ్నించారు. టీచర్ల జోలికి వస్తే ఊరుకునేదని, జగన్ జాగ్రత్తగా ఉండాలని వార్నింగ్ ఇచ్చింది. టీచర్లపై దాడులు చేస్తారా?, కోడి గుడ్డులు వేస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో తగ్గేదేలే లేదన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కుటుంబంలోనే ఏపీ అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించారు. మన రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని, మనలో కసి పెరగాలని కూటమి కార్యకర్తలకు నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

## దేశంలో 1980 ఫోటో ట్రెండ్.. రాష్టంలో 1980ల నాటి పరిస్థితులు

"పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు.రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.ప్రస్తుతం సోషల్ మీడియాలో 1980 నాటి ట్రెండ్ నడుస్తుంటే రాష్ట్రంలో 1980 నాటి పరిస్థితులు నడుస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. ఈ రోజు (బుధవారం) తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితులు ఎల్‌నినో ప్రభావంతో కాదని ఎల్ కాంగో ప్రభావంతోనని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కేటీఆర్ వ్యంగ్యంగా మాట్లాడారు.తెలంగాణలో కరెంట్ సంక్షోభం తలెత్తిందని బీఆర్ఎస్ గతంలోనే కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని చెప్పిందని ప్రస్తుతం రాష్ట్రంలో అవే పరిస్థితులు నడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ వస్తే చీకటిరాజ్యమేనని గతంలోనే చెప్పామని ఇప్పుడు అదే నిజమైందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ 6 గంటలకు మించి కరెంటు లేదని వారం రోజులుగా పవర్ లెస్‌గా ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల బొగ్గు నిల్వలు ఉంటే ఎందుకు విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలి. 4 వేల మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చెయ్యాల్సిన రాష్ట్రంలో 400 మెగా వాట్స్ ఉత్పత్తి చేస్తున్నారు. నాణ్యత లేని బొగ్గుతో రాష్ట్రానికి 2,900 కోట్ల నష్టం సీఎం బావమరిది సృజనాత్మక లీలలతో సింగరేణికి నష్టాలు సీఎం రేవంత్ మెస్సి తో ఫుట్ బాల్ ఆడలేదు.... సింగరేణి సంస్థతో ఫుట్ బాల్ ఆడారు. అని కేటీఆర్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారుకరెంట్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారని నీరు లేక హైడల్ పవర్ ఉత్పత్తి ఆగిపోయిందని తెలిపారు. త్వరలోనే తెలంగాణలోని అన్ని పవర్ ప్లాంట్లు సందర్శిస్తామని ఆరు బృందాలుగా వెళ్లి నిజానిజాలు తెలుసుకుంటామన్నారు. కరెంటు ఉత్పత్తి కేంద్రాల్లో నిజాలు నిగ్గుదేల్చడానికే ఆరు బృందాలుగా వెళ్లి అన్ని పవర్‌ప్లాంట్లను సందర్శిస్తామని కేటీఆర్ అన్నారు.

సీమకిరణం కర్నూలు నంద్యాల తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# కర్నూలులో వైభవంగా ముగిసిన వినాయక నిమజ్జనం

హంద్రీనీవాలో 1,050 విగ్రహాల నిమజ్జనం

కర్నూలు వినాయక ఘాట్‌లో 1,000కు పైగా విగ్రహాలు

ఉలిందకొండలో 96 విగ్రహాల నిమజ్జనం

భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు









**అర్ధరాత్రి తర్వాత పెరిగిన భక్తుల రద్దీ**

**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 23, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా, ప్రశాంతంగా ముగిశాయి. నగరంలోని వినాయక ఘాట్‌తో పాటు కర్నూలు నగర శివారులోని నన్నూరు టోల్‌ప్లాజా వద్ద హంద్రీనీవా, ఉలిందకొండ వద్ద కూడా పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి. కర్నూలు జిల్లాలో నీటి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మంత్రి టీజీ భరత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హంద్రీనీవాలో నీటి లభ్యతను పరిశీలించి అక్కడ కూడా నిమజ్జనం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ముందస్తు ప్రణాళికతో నిమజ్జన ఏర్పాట్లు చేపట్టారు.

అర్ధరాత్రి దాటిన తర్వాత హంద్రీనీవా వద్ద వినాయక విగ్రహాల రాక మరింత పెరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ గణనాథులను ఊరేగింపుగా తీసుకొచ్చిన భక్తులు హంద్రీనీవాలో నిమజ్జనం చేసేందుకు ఆసక్తి చూపారు. దీంతో నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలో సందడి నెలకొంది. జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమానికి తరలివచ్చారు. భారీ విగ్రహాలతో వాహనాలు వరుసగా రావడంతో హైవేపై వినాయక విగ్రహాలు బారులు తీరాయి. అధికారులు, పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

**మూడు ప్రాంతాల్లో భారీగా నిమజ్జనం**

నన్నూరు టోల్‌ప్లాజా వద్ద హంద్రీనీవాలో 1,050 వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ వద్ద కేసీ కెనాల్‌లో 1,000 వరకు విగ్రహాలు నిమజ్జనం చేశారు. అలాగే ఉలిందకొండ వద్ద 96 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. హంద్రీనీవాలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిమజ్జన కార్యక్రమం కొనసాగింది. అర్ధరాత్రి తర్వాత విగ్రహాల రాక పెరిగింది. భారీ సంఖ్యలో విగ్రహాలు తరలివచ్చినప్పటికీ ముందస్తు ఏర్పాట్ల కారణంగా నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. నీటి కొరత ఉన్న పరిస్థితుల్లోనూ ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలను సిద్ధం చేయడం ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించారు. హంద్రీనీవా, కేసీ కెనాల్, ఉలిందకొండ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన సదుపాయాలను భక్తులు వినియోగించుకున్నారు. మొత్తంగా కర్నూలు నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. అధికారులు, పోలీసులు, వివిధ శాఖల సిబ్బంది సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించారు.

# యువత భవితకు భరోసా..!

విద్య.. నైపుణ్యాలు.. ఉపాధే లక్ష్యం : ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్‌కుమార్

కంప్యూటర్ల కొరతకు చెక్..!

విద్యార్థుల కోసం సొంత నిధులతో కంప్యూటర్లు : ఎమ్మెల్యే హామీ



**పత్తికొండ , సెప్టెంబర్ 23, (సీమకిరణం న్యూస్):** రాష్ట్రంలోని యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్‌కుమార్ అన్నారు. "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో భాగంగా కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులు, కళాశాల సిబ్బందితో మాట్లాడి విద్యా సౌకర్యాలు, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించారు. వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఎమ్మెల్యేతో సెల్ఫీలు తీసుకున్నారు.



**సొంత నిధులతో కంప్యూటర్లు..**

కళాశాలలో కంప్యూటర్ల కొరత ఉందని, విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కళాశాల సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన కంప్యూటర్లను త్వరలో తన సొంత నిధులతో సమకూర్చుతానని హామీ ఇచ్చారు. "నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు ఎంతో అవసరం. నియోజకవర్గంలోని విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. కంప్యూటర్ల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో త్వరలోనే నా సొంత నిధులతో కంప్యూటర్లను అందిస్తాను" అని ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్‌కుమార్ తెలిపారు.






**సద్వినియోగం చేసుకోవాలి..**

యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు తాను ముందుంటానని ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్‌కుమార్ స్పష్టం చేశారు.

# రోడ్డు భద్రతా చర్యల్లో నిర్లక్ష్యం వహించొద్దు

బ్లాక్‌స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం చేయాలి

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 23 (సీమకిరణం న్యూస్):** జిల్లాలోని బ్లాక్‌స్పాట్లు, ప్రమాదకర కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక భద్రతా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గుర్తించిన 18 బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాదాల తీవ్రతను బట్టి తాత్కాలిక, దీర్ఘకాలిక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచలింగాల విలేజ్ క్రాస్‌రోడ్ వద్ద దీర్ఘకాలికంగా వెహికల్ అండర్‌పాస్ (వియుపి) నిర్మాణానికి ప్రతిపాదన ప్రక్రియలో ఉన్నందున, అప్పటివరకు రిఫ్లెక్టివ్ పెయింట్‌తో స్పీడ్ బ్రేకర్లు, పెద్ద సైనేజ్ బోర్డులు, సిమెంట్ బ్యారికేడ్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కేశవ గ్రాండ్ సమీపంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుత్తి ఫ్లైఓవర్ వద్ద సిమెంట్ బ్యారియర్లు, సైన్ బోర్డులు, ఇల్యూమినేషన్ వంటి భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల నుంచి నేరుగా జాతీయ రహదారులకు కలిసే గ్రావెల్ రోడ్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రివేళల్లో స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించేలా వైట్ పెయింటింగ్‌తో పాటు సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తడకనపల్లి క్రాస్‌రోడ్, చిన్నటేకూరు




గ్రామం వద్ద యూ-టర్న్ ప్రాంతంలో వియుపి/ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని, నిర్మాణ పనులు ప్రారంభమైనందున నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. నాయకల్లు ఫ్లైఓవర్ వద్ద లైటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు.

**ప్రమాదాలను గణాంకాలుగా చూడొద్దు...**

రోడ్డు ప్రమాదాలు, మరణాలను కేవలం గణాంకాలుగా చూడకుండా, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు సున్నితంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గుంతల పూడ్చివేత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల పక్కన ఏర్పాటు చేస్తున్న లేఅవుట్లు, వెంచర్ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా నేరుగా జాతీయ రహదారులకు రోడ్డు కనెక్షన్లు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుంచి



కలెక్టరేట్ కాంప్లెక్స్ వరకు రోడ్డు విస్తరణ, టిడిఆర్ పరిహారం ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఆక్రమణలపై సంయుక్త తనిఖీలు...**

జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలు, ధాబాల వద్ద వాహనాల పార్కింగ్ పరిస్థితులపై రెవెన్యూ, పోలీసు, సంబంధిత శాఖల అధికారులతో సంయుక్త తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆక్రమణలకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే తొలగింపు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించిన పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో గుర్తించిన 18 బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రమాదాల తీవ్రతను బట్టి అవసరమైన భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిన్ బ్యాగ్ విధానంపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన




డిప్యూటీ ఎంపీడీవో వై .ప్రభాకర్

**ప్యాపిలి, సెప్టెంబర్ 23 (సీమ కిరణం న్యూస్) :** స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్యాపిలి పట్టణంలోని బీసీ కాలనీలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బిన్ బ్యాగ్ విధానాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. తదుపరి మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు బిన్ బ్యాగ్ విధానం, పరిసరాల పరిశుభ్రత, చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో, నాయకులు రాజా నారాయణమూర్తి, ఖాజా పీర్, ఎస్కే వలి, శ్రీను, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఎంఈఓ లు వెంకటేష్ నాయక్, మహేష్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు, ఎస్ .హెచ్. జీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## చనుగొండ్ల గ్రామంలో150 కుటుంబాలు టిడిపిలోకి చేరిక





**డోన్ టౌన్, సెప్టెంబర్ 23,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో చనుగొండ్ల గ్రామము శ్రీరాములు, బజారప్ప, ఏంకోబరావు, మాధవయ్య, డోన్ మండల అధ్యక్షులు దశరథ రామిరెడ్డి, ఉపాధ్యక్షులు ధర్మవరం సంజీవుడు సమక్షంలో డోన్ మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు,డోన్ మండల ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులతో పాటు దాదాపు 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ అని, పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. అదే విధంగా డోన్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల పట్ల ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నందునే పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు .

## కర్నూలులో ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనోత్సవం

ఐకమత్యం, మతసామరస్యాన్ని చాటిన కర్నూలు ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు

కర్నూలు ప్రజల ఐకమత్యానికి అభినందనలు







**కర్నూలు క్రైమ్, సెప్టెంబర్ 23, (సీమకిరణం న్యూస్):** కర్నూలు నగరంలో గణేష్ నిమజ్జనోత్సవం ప్రజలందరి సహకారంతో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రజలు ఐకమత్యంతో, పరస్పర సహకారంతో నిమజ్జనోత్సవాన్ని నిర్వహించి మతసామరస్యాన్ని చాటారని ఆయన పేర్కొన్నారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన గణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా పోలీసు యంత్రాంగం, ట్రైనీ పోలీసులు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది, యువత, మీడియా ప్రతినిధులు, పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛంద సేవకులు సహా ప్రతి ఒక్కరికీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారం, పోలీసు శాఖ సమన్వయం, వివిధ ప్రభుత్వ శాఖల సమిష్టి కృషితో నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ పేర్కొన్నారు. కర్నూలు ప్రజలు ప్రదర్శించిన ఐకమత్యం, మతసామరస్యం అందరికీ ఆదర్శంగా నిలిచిందని ఆయన తెలిపారు.

## దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలి

పట్టణంలోని అన్ని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ ఏర్పాటు చేయాలి : సీపీఐ



**వెల్దుర్తి, సెప్టెంబర్ 23, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి పట్టణంలో దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ నిర్వహించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను అందుబాటులో ఉంచాలని కోరారు. దోమల కారణంగా టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి అనారోగ్య సమస్యలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని కోరారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి రహమత్ భాషకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి. కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి గిరిబాబు, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, చిన్న వ్యాపారుల సంఘం నాయకులు అనిల్, సీపీఐ సీనియర్ నాయకులు డి. రాజు, రైతు సంఘం నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

ఐదేళ్ల పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశాం

ఎంపీపీ గోకుల్ లక్ష్మి










**ప్యాపిలి, సెప్టెంబర్ 23 (సీమ కిరణం న్యూస్) :** మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి గత ఐదేళ్లుగా తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు గోకుల్ లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోకుల్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు మండల అధికారులు హాజరై తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలు, చేపట్టిన పనుల వివరాలను సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోకుల్ లక్ష్మి మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ తదితర సమస్యలపై సమన్వయంతో పనిచేసి మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గత ఐదేళ్లుగా ఎంపీపీగా తనకు సహకరించిన జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీపీ గోకుల్ లక్ష్మి, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులను అధికారులు, అభిమానులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

